క్లుప్తంగా

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు



కలశ పూజలో పాల్గొన్న గ్రామ పెద్దలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ పునః ప్రారంభోత్సవంతో పాటు వాల్మీకి, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలు, సుంకులమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల వద్ద ధ్వజస్తంభ, బొడ్రాయిల ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామపెద్దలు ఆధ్వర్యంలో వేద పండితులు హోమాలు, పూజ కార్యక్రమాలు చేపట్టారు. అభయాంజనేయ స్వామి విగ్రహం, బొడ్రాళ్లను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. బుధవారం ఉదయం నూతన దేవాలయంలో ఆంజనేయస్వామి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు వారు తెలిపారు.

గంగమ్మకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

పత్తికొండ(తుగ్గలి) : మండల పరిధిలోని రామచంద్రాపురంలో వెలసిన గంగమ్మ దేవతకు గ్రామానికి చెందిన కూరగాయల మండి యజమాని మేడ బాలిమి రమేష్, శ్రీ కళ కుటుంబ సభ్యులు వెండి కిరీటాన్ని బహూకరించారు. రూ.65వేలతో వెండితో తయారు చేయించిన నాగపడగ కిరీటం మంగళవారం ఆలయ అర్చకులకు నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు చేయించి, అర్చకులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో పత్తిపాటి ప్రకాష్, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

కలశాల ఊరేగింపు



కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

మద్దికెర : స్థానిక కొండమ్మ బావిలో ఉన్న ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో కలశ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలశాలను గ్రామ పురవీధుల గుండా బసవన్న గుడి వద్ద నుంచి ఉమామహేశ్వర దేవాలయం వరకు ఊరేగించారు. బుధవారం ఉదయం గణపతి పూజ అనంతరం కలశ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు.

27 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

హొళగుంద: విజయనగరంలో ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీ"షకుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు జరిగే ఈ సభలో భవిష్యత్ కార్యచరణపై చర్చలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజేష్, ప్రకాష్, రవి,దేవరాజ్, మల్లి, రమేష్, మల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన



కడప ఆర్జేడీ నాగలింగారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కృష్ణగిరి: డిగ్రీ కాలేజీ ఏర్పాటు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు కడప ఆర్జేడీ నాగలింగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారులో మంగళవారం ఆయన అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపాన ఉండే స్థలాన్ని పరిశీలించామని, నివేదికను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఆయన వెంట డోన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి, తహసీల్దార్ చంద్రశేఖర్, నాయకులు నబిసాహెబ్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

ఆస్పరి: ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ గీతావాణి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయితీ కార్యదర్శి జంప్లానాయక్, సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేలం పాటలు జరిగేనా?

- టీడీపీ వర్గాల మధ్య సయోధ్య కుదిరేనా?
- 21న గ్రామ పంచాయతీ దుకాణాలకు బహిరంగ వేలం
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన వైనం
- ఆలూరులో జోరుగా సాగుతున్న చర్చ



స్థానిక సంత మార్కెట్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు రూరల్: పట్టణంలోని సంత మార్కెట్‌లో నిర్మించిన షాపింగ్ కాంపెక్స్‌లకు సంబంధించి వేలం పాటలు మూడేళ్ల నుంచి అనివార్య కారణాల మూలంగా వాయిదా పడుతూనే ఉంది. ఎట్టికేలకు 21న గురువారం బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు ప్రకటించారు. అయితే ఈసారైనా వేలం పాటలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు పట్టణ ప్రజలకు వ్యక్తం చేస్తున్నారు.

నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ.1.20 కోట్లతో 2018 ఏడాదిలో 27 షాపుల నిర్మాణాలు చేపట్టి 2020లో పూర్తి చేశారు. బహిరంగ వేలాల ద్వారా వివిధ రకాల వ్యాపారస్తులకు కేటాయించాల్సి ఉన్నా ఆ ప్రక్రియ జరగడం లేదు. 2022, 2023 వేలం పాటలు వివిధ కారణాల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. 2024 ఆగస్టు 27 జరిగిన వేలం పాటలను సైతం టీడీపీకూటమి నాయకులు అడ్డుకోవడంతో మూడోసారి ముచ్చటగా వాయిదా పడింది. ఈ సారి పకడ్బందీగా వేలాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ అధికారులు వెల్లడించారు. గురువారం వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే టీడీపీ కూటమి నాయకుల మధ్య ఉన్న విభేదాలు మూలంగా మళ్లీ వాయిదా పడుతాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ – సర్పంచ్ అరుణాదేవి మధ్య విభేదాలు

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్, టీడీపీ మద్దతు రాలు గ్రామ సర్పంచ్ అరుణా దేవిల మధ్య అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. సర్పంచ్‌గా తనకు విలువ ఇవ్వడం లేదని గ్రామ అభివృద్ధికి వీరభద్ర గౌడ్ సహకరించడం లేదంటూ గత మూడు రోజుల క్రితం సర్పంచ్ అరుణా దేవి రోడ్డెక్కిన విషయం తెలిసిందే. ఏకంగా ధర్నా చేపట్టిన సర్పంచ్ అరుణాదేవి వీరభద్ర గౌడ్ తీరును తప్పుపట్టారు. అయితే వీరభద్రగౌడ్ సైతం సర్పంచ్ తీరుపై అదేస్థాయిలో మండిపడ్డాడు. పెండింగ్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు నిర్వహిస్తుంటే ఓర్వలేకున్నారని విమర్శలు గుప్పించారు. ఆ షాపుల కేటాయింపు కోసం ఇంతకు ముందే సర్పంచ్ అన్న కిషోర్ వ్యాపారస్తుల నుంచి రూ.10 లక్షల వరకు తీసుకున్నారని ఘాటుగానే ఆరోపించారు. అయితే షాపుల కోసం తాము రూ.10 లక్షలు తీసుకున్నట్లు నిరూపించాలని సర్పంచ్ అరుణాదేవి ఏకంగా విలేకరుల సమావేశం నిర్వహించి వీరభద్ర గౌడ్‌కు సవాల్ విసిరారు కూడా. ఈ నేపథ్యంలో వీరి మధ్య ఉన్న విబేధాలు కాంప్లెక్స్ వేలాలపై ప్రభావం చూపుతాయాని అని వ్యాపారస్తులు చర్చించుకుంటున్నారు.

షాపుల వేలాలు పారదర్శకంగా నిర్వహిస్తాం



షాపింగ్ కాంప్లెక్స్‌లను రిజర్వేషన్ల వారీగా లాటరీ పద్ధతిన కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 షాపులు బీసీలకు, 4 ఎస్సీలకు, 2 ఎస్టీలకు కేటాయించారు. ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీలో రూర్బన్ నిధులతో నిర్మించిన 27 షాపులకు ఈ నెల 21 (గురువారం) వేలాలు పారదర్శకంగా నిర్వహిస్తాం. ఇప్పటికే లాటరీ పద్ధతిన 14 షాపులను ఎస్సీ,ఎస్టీ,బీసీలకు కేటాయించాం. మిగిలిని 13 షాపులకు సంబంధించి ఇతరులు వేలం పాడుకోవచ్చు. వేలం పాటలకు వ్యాపారస్తులు సహకరించాలి. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి.

– వీరభద్రప్ప, పత్తికొండ డీఎల్‌పీఓ.

25 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఈనెల 25వ తేదీ నుంచి విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నామని వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆలూరు ఏరియా కో–ఆర్డినేటర్ వీరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రి, ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు కళాశాల కంప్యూటర్ సెక్షన్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 9010003132 సెల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: కార్తీక మాసంలో భాగంగా మంగళవారం ఆస్పరి సమీంలో వెలసిన మారెమ్మవ్వకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు ఇచ్చారు. అదేవిధంగా కార్తీక దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు.

కష్టపడి కాదు ...ఇష్టపడి చదవాలి

హొళగుంద: ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే కష్టపడి కాకుండ ఇష్టంతో చదవాలని హొళగుంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన హొళగుంద సింగిల్‌విండో కార్యాలయంలో 71 సహకార వారోత్సవాలను పురష్కరించుకుని స్థానిక కేజీబీవీ 10వ తరగతి విద్యార్థినులకు సిబ్బందితో కలిసి ఉచితంగా పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అబ్దుల్ సుకూర్, సెక్రటరీ నీలకంఠస్వామి, సిబ్బంది బసవ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఆర్డీఓ భరత్ నాయక్



ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్

ఆలూరు రూరల్: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆర్డీఓ భరత్ నాయక్ డాక్టర్లకు సూచించారు. మంగళవారం ఆర్డీఓ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. 30 పడకల వార్డు, ప్రసూతి గది, ఎమర్జెన్సీ మెడికల్ రూములను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున రోగులకు ఎప్పటికప్పుడు చికిత్స అందిచాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని రోగులకు చెప్పాలన్నారు. ఆస్పత్రితోపాటు ఆవరణలో పారిశుద్ధ్యలోపం లేకుండా చూడాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ గోవింద్‌సింగ్, డీటీ విజయ్ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వైద్యులు వాహిద్, శ్రీకాంత్, రాజశేఖర్ ఉన్నారు.

రేషన్ సరఫరా సక్రమంగా నిర్వహించాలి

తెల్ల కార్డుదారులకు ప్రతి నెలా అందించే రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ భరత్ నాయక్ గోడౌన్ ఇన్‌చార్జ్ బసవన్న గౌడ్‌కు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ఎల్లార్తి రోడ్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గోదాములో ఎంత స్టాక్ ఉందని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్ నుంచి బియ్యం సంచులను తూకం వేసి డీలర్లకు అందించాలన్నారు. ప్రజా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పత్తికొండలో అపార్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో ఎస్ భరత్‌నాయక్

ప్రతి విద్యార్థికీ అపార్ తప్పనిసరి

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్‌లోని ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ జనరేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని పత్తికొండ ఆర్డీఓ డాక్టర్ ఎస్ భరత్‌నాయక్ ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓలు, కాలేజీ ప్రిన్సిపాల్స్‌తో అపార్‌పై సమీక్ష నిర్వహించారు. అపార్ ఐడీ రిజిస్ట్రేషన్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, ఐటీఐలలో ఎంత శాతం పూర్తయిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను విద్యాశాఖ అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆధార్ సమస్యను పరిష్కరించుకుని త్వరితగతిన అపార్ ఐడీల జారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సేవల్లో ప్రథమం



సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): సేవా కార్యక్రమాలలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉందని పాస్ట్ లయన్స్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య తెలిపారు. స్థానిక అమెజాన్ రిసార్ట్స్‌లో మంగళవారం జరిగిన రీజినల్ చైర్మన్ గెట్ టుగెదర్, జోన్ అడ్వైజరీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి లయన్స్ క్లబ్ సభ్యుడు లీడర్షిప్ క్వాలిటీని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమలో క్లబ్ సభ్యులు మాణిక్య ప్రభు, డాక్టర్ రాహుల్, జోన్ చైర్మన్ ప్రభాకర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సీఈఓ నరసింహులు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో నాబార్డు నిధులు రూ.13 లక్షలతో చేపట్టిన కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం నవయూత్ సీఈఓ నరసింహులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించడమే గాకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రతిఒక్కరూ సహాయ సహకరాలు అందించాలని కోరారు. బండారు ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరెడ్డి తదితరులు వున్నారు.

పురాతన నాణేలు, నోట్ల ప్రదర్శన

ఆస్పరి: మండలంలోని కై రుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం పురాతన నాణేలు, విదేశీ నోట్లు ప్రదర్శనకు ఉంచారు. బనవనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు నగేష్ బాబు 150 దేశాలకు చెందిన పురాతన నాణేలు సేకరించారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రదర్శనకు ఉంచారు. పురాతన నోట్లు, నాణేలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కై రుప్పల, చిన్నహోతూరు, కారుమంచి హెచ్‌ఎంలు అహ్మద్, ఏకాంబరం, శోభారాణి పాల్గొన్నారు.



కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్లో పురాతన నాణేలు, నోట్లు తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మల్లెపల్లెలో శనగ పంటలో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): సస్యరక్షణ చర్యలు చేపట్టి శనగ పంటను కాపాడుకోవాలని ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శనగ పంటలో పచ్చ పురుగు గమనించినట్లయితే ఏమోమెక్టిన్ బెంజోయేట్ లేదా క్లోరాంత్రనిలిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. కందిలో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ 200 ఎం.ఎల్ ఎకరానికి వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అక్బర్‌బాషా, రైతు సేవా సిబ్బంది అనిల్ సుధీర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో ।పొలం పిలుస్తోంది॥ కార్యక్రమాన్ని మంగళవారం ఏఓ శివశంకర్ నిర్వహించారు. రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు చేశారు. రబీ సీజన్‌కు సంబంధించి జొన్న పంటకు రూ.297 ఎకరాలకు, శనగకు ఎకరాకు రూ.420 చొప్పున రైతులు ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతింటే ఇన్సూరెన్స్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకటలక్ష్మి, రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి



విద్యుత్ సిబ్బందితో సమావేశమైన ఏడీఈ సంతోష్‌కుమార్

ఆలూరు: విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏడీఈ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఏడీఈ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఆలూరు ఏఈ గుర్రప్ప ఆధ్వర్యంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల జెఎల్‌ఎం, ఎల్ఐ, పోల్‌టూ పోల్, బిల్‌కలెక్టర్లు తదితరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలోని గృహాలు, బోరు బావుల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి రెండునెలలుగా రూ. 1.66 కోట్ల విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉందన్నారు. పరిమితికి మించి విద్యుత్ వాడినన వారిపై విధించిన జరిమా రూ. 11 లక్షలు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. మొండి బకాయిల వసూళ్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో లైన్‌లాస్ జరగకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకోవాలని ఏడీఈ సంతోష్‌కుమార్ ఆదేశించారు.

లోకాయుక్త, హెచ్ఆర్సీలను తరలించొద్దు

పత్తికొండ(తుగ్గలి) : అమరావతి అభివృద్ధి పేరుతో కర్నూలు నుంచి లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)లను తరలించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, కారప్ప, సత్యనారాయణ, శేఖర్, సురేంద్రకుమార్ కోరారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం గత ప్రభుత్వం కర్నూలులో లోకాయుక్త, హెచ్ఆర్సీ, వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని ప్రస్తుత ప్రభుత్వం తరలించడం సబబు కాదన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా ఉన్న కార్యాలయాలను అమరావతికి తరలిస్తే రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యాలయాల తరలింపునకు నిరసనగా కర్నూలు, అనంతపురం జిల్లాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 22 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవికుమార్, రాజశేఖర్, సహాయ కార్యదర్శి వాసు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి

అంగన్‌వాడీ కేంద్రాలకు నీటిపైపులైన్ ఏర్పాటు

హాలహర్వి: మండలంలోని గూళ్యం అంగన్‌వాడీ కేంద్రం-4, జె.హొసళ్లి అంగన్‌వాడీ కేంద్రం-1కు మంచి నీటి పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టినట్లు గూళ్యం సర్పంచ్ ఉలిగమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పనులు చురుగ్గా సాగాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు నీటి సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు నాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి దాత ఇందిరాగాంధీ



ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మహిళలు అన్ని రంగాల్లో ఎదిగే స్ఫూర్తినిచ్చిన ప్రదాత ఇందిరాగాంధీ అని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కవితాబాయి, పాఠకులు భాగ్యలక్ష్మి, సాలమ్మ పాల్గొన్నారు.

హొళగుంద: దివంగత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 107వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ అమానుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఇందిరా గాంధీ చేసిన త్యాగాలను ఈ సందర్భంగా అమానుల్లా గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చాకలి మంగయ్య, సిద్దప్ప, ఖాజా హుసేన్, పీర్‌సాబ్, సిద్ధిక్, బాబుసాబ్, బసవప్పగౌడ పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారం ఇవ్వాలి



ఏఓ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆస్పరి: పెండింగ్ పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, రంగస్వామి, రామాంజినేయులు, చిన్న ఈరన్న ఏఓ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2023 సంవత్సరంలో రబీలో పంటలు వేసిన రైతులు పెట్టుబడులకు రాక తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం కరువు ప్రకటించిండమే కాకుండా కేంద్ర బృందం కూడా జిల్లాలో పర్యటించిందన్నారు. 2023 సంవత్సరం ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు అప్పటి ప్రభుత్వం పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5నెలలు కావస్తున్నా రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్

కృష్ణగిరి: పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహిరంగ మలవిసర్జన అనేక అనర్థాలకు దారీ తీస్తుందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచి మరుగుదొడ్లు వినియోగించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం వల్ల నీరు కలుషితం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఈ హరినాథ్, ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆలూరు రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్ సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో గ్రామ పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వరుణ్, రాము సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

ఆస్పరి: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దొనోత్సవం సందర్భంగా మంగళవారం ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు మండలం పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ విజయభాను, కేడీసీసీ మాజీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు పాల్గొన్నారు.

దేవనకొండ: ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ఎంపీడీఓ గౌరీదేవి సూచించారు. మరుగుదొడ్ల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మరుగుదొడ్ల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకుని పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

చిప్పగిరి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎంపీడీఓ అల్లాబకాష్ పేర్కొన్నారు. మంగళవారం హమారా సౌచాలం, హమారా సమ్మన్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చిప్పగిరి సచివాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందారాజులు, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మద్దికెర : ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యంగా ఉంటారని మద్దికెర సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీడీఓ కొండయ్య అన్నారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా క్లాప్ మిత్రులను సన్మానించారు. మాట్లాడుతూ ఉదయం లేవగానే గ్రామాలలోని వీధులను శుభ్రంగా వుంచడమే గాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. వీరికి తగిన గౌరవం ఇవ్వడం మన కనీస ధర్మమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

హాలహర్వి: ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకుని స్వచ్ఛత పాటించాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. ఈ మేరకు మరుగుదొడ్ల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్లు లేని వారు నిర్మించుకునేలా అవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణమ్మ, హెచ్‌ఎం హుసేన్‌సాబ్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

నాటుసారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు



కిరాణం షాపుల యజమానులతో సమావేశమైన ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితాదేవి

ఆలూరు: నాటుసారా తయారీ దారులకు బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆలూరు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ లలితాదేవి హెచ్చరించారు. మండల కేంద్రం ఆలూరుకు కిరాణం షాపుల యజమానులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. నాటు సారాను ప్రతిఒక్కరూ నిషేధించాలన్నారు. ప్రజలకు అవసరం మేరకే బెల్లం విక్రయించాలని, ఎక్కువగా ఇచ్చినట్లు తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ నవీన్, పోలీసులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను సందర్శించిన సీఐ

హొళగుంద: సీఐ వెంకట చలపతి మంగళవారం హొళగుంద పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భగా మండలంలోని వివిధ అంశాలపై ఎస్ఐ బాల నరసింహులుతో సీఐ చర్చించారు. పెండింగ్ కేసులు, నేరాల వివరాలు, సమస్యాత్మక గ్రామాలు తదితర వాటి గురించి ఆరా తీశారు. ఎఫ్ఐఆర్, రికార్డులను పరిశీలించారు. మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని కఠిణంగా శిక్షిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐ వెంకట చలపతి